సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 10 । మే । 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం వేకువజామునుంచే బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బారులుతీరారు.



అడుగంటిన వరద నీరు

రామగుండం: గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో వరద నీరు అడుగంటిపోతుంది. ప్రాజెక్టు నీటిమట్టం 20.175 టీఎంసీలకు ప్రస్తుతం 13.48 టీఎంసీల నీరు ఉంది.

గరిష్టం/కనిష్టం
38.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంచాయతీ ఆఫీసు గోడలపై నోటీసులు



నోటీసు అంటిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నోటీసులు తీసుకునేందుకు నిరాకరించగా, సంబంధిత అధికారులు, సిబ్బంది మంగళవారం గ్రామ పంచాయతీ ఆఫీసు గోడలకు నోటీసులను అంటించారు. ఈనెల 9న సాయంత్రం 5గంటలలోగా సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేకుంటే విధుల నుంచి తొలగిస్తామంటూ ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసిన విషయం విదితమే. నోటీసులు తీసుకోకుండా జిల్లాలోని కార్యదర్శులంతా అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

డయాలసిస్ సెంటర్ మంజూరు

మంథని: మంథని సామాజిక వైద్యశాలలో ఐదు పడకల డయాలసిస్ సెంటర్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో వైద్యం కోసం కరీంనగర్, వరంగల్ లాంటి ప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గత నెల 23న మంథనిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా డయాలసిస్ సెంటర్ మంజూరు చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, కమిషనర్‌కు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన శ్రీనిధి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని రాధారపు శ్రీనిధి బీపీసీ ఫస్టియర్‌లో 440 మార్కులకు 434 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించించి. మండల కేంద్రంలోని బాపూజీనగర్‌కు చెందిన రాధారపు సదయ్య, స్వప్న వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద కూతురు శ్రీనిధి పదో తరగతి వరకు సెంటనరీకాలనీలోని హిల్‌ఫోర్డ్ పాఠశాలలో చదివింది. ఇంటర్ గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీలో చేరి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది.



కుటుంబ సభ్యులతో శ్రీనిధి

డాక్టర్ కావాలని ఉంది..



నాకు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే సంకల్పం ఉంది. ఇంటర్‌లో బైపీసీలో చేరాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదుకొని మెడిసిన్ చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఉంది.

– రాధారాపు శ్రీనిధి

అమ్మాయిలదే హవా

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన బాలికలు

- ఫస్టియర్‌లో 46 శాతం, సెకండియర్‌లో 59 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో జిల్లాకు 29వ స్థానం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాలికలే హవా కొనసాగించారు. మంచి ఫలితాలు సాధించి సత్తాచాటారు. ఫస్టియర్‌లో 46శాతం, సెకండియర్‌లో 59 శాతంగా ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. జిల్లాలో ఫస్టియర్ పరీక్షలు మొత్తం 1,850 మంది బాలురు రాయగా 570 మంది (30.81శాతం) ఉత్తీర్ణులయ్యారు. 2,608 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 1,485 మంది (56.94 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలు 1,801 మంది బాలురు రాయగా, 826 మంది (45.86శాతం), బాలికల్లో 2,705 మందికి 1,841 మంది (68.06 శాతం) పాసయ్యారు. మొత్తంగా జిల్లా ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో 29వ స్థానంలో నిలిచింది.

పెద్దపల్లి ప్రభుత్వ బాలికల కాలేజీలో..

పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులు ఉత్తమ మార్కులు సాధించారు. సెకండియర్ సీఈసీలో అడిచర్ల శ్రావ్య 956, మద్ది మేఘన 938, కొమ్ము భవాని 823 మార్కులను సాధించారని ప్రిన్సిపాల్ మైత్రేయి తెలిపారు. బీపీసీ సెకండియర్ విద్యార్థిని కోట రక్షిత 942, ఎంపీసీలో బైరి స్రవంతి 794 మార్కులు సాధించారు. అలాగే వొకేషనల్ విద్యార్థులు 80శాతం ఉత్తీర్ణులయ్యారు.

తల్లి ప్రోత్సాహంతో..



ఇందూ వర్షిణి

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి కూచిరాజ్‌పల్లి మైనార్టీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థి రిమ్మలపూడి ఇందూవర్షిణి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించింది. ఎంపీసీలో వెయ్యికి 980 సాధించింది. ఫస్టియర్‌లో 470 మార్కులకు 465 సాధించి సత్తాచాటింది. మంథని మండలం మైదుపల్లి గ్రామానికి చెందిన రిమ్మలపూడి ప్రసాద్–రాధ పెద్ద కూతురు ఇందూవర్షిణి. పేద కుటుంబానికి చెందిన ఈమె తండ్రి అనారోగ్యంతో పదేళ్ల క్రితం మరణించాడు. తల్లి ప్రోత్సాహంతో చదువులో రాణిస్తూ మంచి మార్కులు సాధించడంతో పలువురి అభినందనలు అందుకుంటుంది.

బీఎస్సీ అగ్రికల్చర్‌లో చేరుతా..



నిరుపేద కుటుంబానికి చెందిన కాటు అక్షిత బీపీసీ సెకండియర్‌లో వెయ్యి మార్కులకు 942 మార్కులు సాధించింది. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా, తల్లి వ్యవసాయ కూలీగా పనిచేస్తు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదివి ఉద్యోగంలో స్థిరపడాలన్న ఆలోచనతో ఉన్నట్లు.. బీఎస్సీ అగ్రికల్చర్‌లో చేరుతానని అక్షిత పేర్కొంది.

సివిల్స్‌లో చేరాలన్నదే లక్ష్యం



ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన మద్ది మేఘన డిగ్రీలో చేరి తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతానంటోంది. ఈమె తల్లిదండ్రులు మల్లేశం, సరిత వ్యవసాయం చేస్తుంటారు. అమ్మానాన్న కష్టపడి పనిచేస్తూ తనను చదివిస్తున్నారని పేర్కొంది. వారి ఆశలకనుగుణంగా ఉన్నత స్థితికి ఎదుగుతానన్న ధీమా వ్యక్తం చేసింది.

రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన సాయిఅమూల్య



పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థిని వూట్ల సాయి అమూల్య ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించి సతాఆచాటింది. ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయి అమూల్య 470 మార్కులకు 465 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

విధుల నుంచి తొలగిస్తామనడం సరికాదు



గోదావరిఖని(రామగుండం): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను బలవంతంగా విధుల్లోకి చేరాలని లేకుంటే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న పేర్కొన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. కార్యదర్శుల సమస్యలను సామరస్యంగా, సానుభూతితో పరిశీలించకుండా బెదిరింపులకు దిగుతున్నారన్నారు. సమ్మె చేసే కార్మిక సంఘాలు, కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. సమావేశంలో ఐ.క్రిష్ణ, నరేష్ తదితరులున్నారు.

సుల్తాన్‌పూర్ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌కు రెండోస్థానం

ఎలిగేడు(పెద్దపల్లి): జాతీయ నాణ్యత ప్రమాణాలు పాటించి, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నందుకు మండలంలోని సుల్తాన్‌పూర్ హెచ్‌డబ్ల్యూసీకి (హెల్త్ వెల్‌నెస్ సెంటర్) సేవల్లో రాష్ట్రంలో రెండో స్థానం దక్కినట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తెలిపారు. జాతీయ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ ప్రమాణాలు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్‌ఫేర్ బృందం సభ్యులు గత ఏప్రిల్ 26న సెంటర్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. వందకు 75 శాతంతో రెండో స్థానంలో నిలిచిందని, ఇందుకు సహకరించిన డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, ఎంపీపీ స్రవంతి, జెడ్పీవైస్ చైర్‌పర్సన్ రేణుక, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తదితరులకు మెడికల్ ఆఫీసర్ అభినందనలు తెలిపారు.

సమ్మెపై తగ్గేదే లే!

- పట్టువీడని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- జేపీఎస్‌ల ఇళ్లకు నోటీసులు అంటించిన డీపీవో సిబ్బంది
- సా. 5గంటలతో ముగిసిన ప్రభుత్వ గడువు
- టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రితో చర్చలు విఫలం
- న్యాయం జరిగేవరకు సమ్మె సాగుతుందని స్పష్టీకరణ



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజేందర్, తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తమ సర్వీసు రెగ్యులరైజ్ చేయాలంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె మరింత ఉధృతమైంది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికి సమ్మె విరమించి సర్వీసులో చేరాలన్న ప్రభుత్వ ఆదేశాలను జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లు తిరస్కరించారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు తాము సమ్మె వీడేది లేదని, ముందుకు సాగడమే తమ నిర్ణయమంటూ తేల్చి చెప్పారు. దీంతో సమ్మె తీవ్రతరం కానుంది. సర్వీసు క్రమబద్ధీకరణ కోసం సమ్మె చేపట్టిన జూనియర్ పంచాయతీ సెక్రటరీలను మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరాలని ఆశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఆదేశించిన విషయం తెలిసిందే.

నోటీసులపై జేపీఎస్‌ల మండిపాటు

తమ డిమాండ్లు నెరవేర్చకుండా విధుల నుంచి తొలగిస్తామంటూ ఇళ్లకు నోటీసులు అంటించడంపై జేపీఎస్‌లు మండిపడుతున్నారు. ఇళ్లకునోటీసులు అంటించడం ద్వారా కుటుంబ సభ్యులను మభ్యపెట్టి, వారిని ఆందోళనకు గురిచేసే ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం మంత్రి ఎర్రబెల్లి 32 జిల్లాకు ఒకరి చొప్పున జేపీఎస్‌లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. జేపీఎస్‌ల అంతా సమ్మె విరమించి విధుల్లో చేరాలని మంత్రి కోరగా.. తమకు లిఖితపూర్వక హామీకి పట్టుబట్టడంతో చర్చలు అసంపూర్తిగానే ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం (పెద్దపల్లి: 208, జగిత్యాల: 306, కరీంనగర్: 226, సిరిసిల్ల: 198)938 మంది జేపీఎస్‌లు నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదురుగా శిబిరంలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నరేందర్‌రెడ్డిలు తదితర ప్రజాసంఘాల నేతలు శిబిరాన్ని పరామర్శించి మద్దతు తెలిపారు.

సమస్య ఏంటి?

జూనియర్ పంచాయతీ సెక్రటరీల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ టీఎస్‌పీఎస్‌సీ ద్వారా 2018 ఆగస్టు 31న జారీ చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం ఎంపికైన వారు 2019 ఏప్రిల్ 19న సర్వీసులో చేరారు. బేసిక్ సర్వీస్ కండిషన్స్‌లో మూడేళ్ల సర్వీసు తరువాత గ్రేడ్–4 పంచాయతీ సెక్రటరీగా గుర్తిస్తూ సర్వీసు రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇక్కడ కాంట్రాక్టు అనే పదం ఎక్కడా పేర్కొనలేదు, కేవలం ఇది ప్రభుత్వ ఉద్యోగమని, తొలి మూడేళ్లకాలాన్ని ప్రొహిబిషన్ కాలంగా పరిగణిస్తామని వివరించింది. ప్రొహిబిషన్ కాలం ముగిసినా.. వారిని రెగ్యులరైజ్ చేయకుండా 2021, జూలై15న జీవో.26 జారీ చేశారు. ఈ జీవోలో 'అగ్రిమెంట్' అనే కొత్త పదం తీసుకువస్తూ.. ప్రొహిబిషన్ కాలాన్ని ఏడాదిపాటు పెంచారని జేపీఎస్‌లు ఆరోపిస్తున్నారు. అనంతరం నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తయిన తరువాత కూడా వీరికి సర్వీసు రెగ్యులర్ చేయలేదు. దీంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గత ఏప్రిల్ 13న నోటీసు లిచ్చి, 28 నుంచి సమ్మెలోకి దిగారు.

విధుల్లో చేరిన కొందరు?

ఈ నేపథ్యంలో కొందరు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వివిధ మండలాల పరిధిలో సమ్మె వీడి విధుల్లో చేరారని పంచాయతీ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నలుగురు, రామడుగులో ముగ్గురు, గంగాధరలో నలుగురు, మానకొండూరులో ఒకరు, హుజూరాబాద్, వీణవంకలో ఎవరూ చేరలేదు. జమ్మికుంటలో ఇద్దరు, సైదాపూర్‌లో ఒక్కరు.. ఇలా జిల్లావ్యాప్తంగా 57మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. సిరిసిల్లలో తొమ్మిది మంది విధుల్లో చేరారని సమాచారం. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో ఎవరూ విధుల్లో చేరలేదని, అందరూ సమ్మెలోనే కొనసాగుతున్నారు.

నోటీసులివ్వడం దారుణం



ప్రభుత్వం సమ్మెతో చర్చకు రాకుండా భయ భ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తోంది. తమను మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లో చేరకపోతే, శాశ్వతంగా తొలగిస్తామన్న ఆదేశాలను మా ఇళ్లకు అంటించడం ముమ్మాటికీ బెదిరించడమే. ఈ చర్య మా కుటుంబ సభ్యుల్లో ఆందోళన రెకెత్తించేలా ఉంది. కానీ, మేం ప్రభుత్వం ఎత్తుగడలకు మేం తలవంచం.

– మనోహర్‌రెడ్డి

మాట నిలబెట్టుకోవాలి



వాస్తవానికి మేమేం కొత్త కోరికలు కోరడం లేదు. మేము సర్వీసులో చేరే క్రమంలో ఇచ్చిన మాటనే నిలబెట్టుకోవాలని అడుగుతున్నాం. దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం. కాంట్రాక్టు అన్న పదాన్ని కొత్తగా చేర్చి ప్రభుత్వం తాను ఇచ్చిన మాట నుంచి తప్పించుకునే యత్నం చేస్తోంది. నోటిఫికేషన్ సమయంలో పేర్కొన్న విధంగా మా అందరినీ క్రమబద్ధీకరించాల్సిందే.

– శ్రీనివాస్

15 నుంచి సీఎం కప్ ఆటల పోటీలు



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల15నుంచి మండలస్థాయి పోటీలతో ఆరంభిస్తోందని కలెక్టర్ సంగీత తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. మండలస్థాయిలో సీఎం కప్ పోటీల నిర్వహణకు గ్రామీణ క్రీడాప్రాంగణాలను వినియోగించాలన్నారు. ఏ పోటీలు ఎక్కడ నిర్వహిస్తారో నిర్ణయించి పూర్తి వివరాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మండలస్థాయిలో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ (పురుషులకు మాత్రమే) పోటీలను ఈనెల 15,16,17 తేదీల్లో నిర్వహించాలన్నారు. ఈ పోటీలకు అదనంగా స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ (లాంగ్‌జంప్, షాట్‌పుట్) పోటీలను మండలస్థాయి విజేతలకు ఈ నెల 22,23,24 తేదీల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి సీఎంకప్ పోటీల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, జిల్లా పోలీస్ అధికారి వైస్‌చైర్మన్‌గా లోకల్‌బాడీస్ అడిషనల్ కలెక్టర్ కో వైస్‌చైర్మన్‌గా, డీఈఓ, డీఆర్‌డీఓ, జీఎం (పరిశ్రమలు), మున్సిపల్ కమిషనర్‌లు సభ్యులుగా ఉంటారని వివరించారు. ప్రభుత్వాదేశాల ప్రకారం క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌తో పాటు తిరుపతిరావు, ప్రవీణ్‌రెడ్డి, మధుసూదనచారి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ సమావేశం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్స్ యునైటెడ్ ఫోరం సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఫోరం నాయకులు ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం ఎన్టీపీసీ గేట్–2 కాకతీయ కమాన్ వద్ద కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం, ఇతర అంశాలపై జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్స్ నాయకులు కౌశిక హరి, ఎం.శంకర్, టి.శ్రీనివాస్, నాంసాని శంకర్, సీహెచ్.ఉపేందర్, భూమల్ల చందర్, చిలుక శంకర్, భూమయ్య, శ్రీనివాస్, సత్యం, నాగభూషణం పిలుపునిచ్చారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



పెద్దపల్లిరూరల్: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు నాణ్యతగా, నిబంధనల మేరకు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్‌చీఫ్ సంజీవరావు అన్నారు. జిల్లాలోని ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఈఈ కనకరత్నం, డీఈఈ శంకరయ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు





విద్యుత్‌కాంతుల్లో ఆలయం, ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, చైర్మన్ దామోదర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలో స్వయంభుగా వెలసిన నాగలింగేశ్వరుడికి దాదాపు రూ.3కోట్ల వ్యయంతో అద్భుతమైన ఆలయం నిర్మితమైంది. ఇదే గ్రామానికి చెందిన రాష్ట్ర పోలీస్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ చొరవతో నిర్మించిన ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి. పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠాపనోత్సవాలు జరుగుతాయని దామోదర్ తెలిపారు. మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

ప్రతిష్ఠాపన ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, పోలీసు అధికారులు రాగినేడులోని ఆలయాన్ని సందర్శించారు. పరిసర ప్రాంతాలను పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

15 నుంచి టెక్నికల్, నాన్ టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం సెంటనరీకాలనీలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15,16 తేదీల్లో జాతీయస్థాయి టెక్నికల్ నాన్ టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ తెలిపారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరువు శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుమన్, దివ్య, ప్రణవి, అజయ్, అభినవ్, మణికంఠ, మానస పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



గాజుల ప్రశాంత్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీ చెందిన గాజుల ప్రశాంత్ సోమవారం రాత్రి నుంచి కనిపించడం లేదని భార్య గాజుల సుమలత ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రశాంత్ ద్విచక్ర వాహనం మంగళవారం గోదావరి నది బ్రిడ్జిపై ఉండడంతో బండి నంబర్ ఆధారంగా రివర్ పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛత పక్షోత్సవాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అంజయ్య

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో మంగళవారం స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా ఉద్యోగులు, కార్మికులకు పరిశుభ్రత, సంపన్నమైన, ఆరోగ్యకరమైన పరిశ్రమపై అవగాహన నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, మెడికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈఎస్ఐసీ రామగుండం డాక్టర్ అంజయ్య, బ్రాంచ్ మేనేజర్ డీకే రావు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, ఈఎస్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా బొగ్గు తరలిస్తున్న లారీ పట్టివేత



లారీని పట్టుకున్న పోలీసులు, సింగరేణి అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీపీసీ ప్లాంట్ ప్రహరీ పక్కన అక్రమంగా బొగ్గు తరలిస్తున్నారని సమాచారంతో ఎన్టీపీసీ ఎస్సై జీవన్, సింగరేణి జూనియర్ ఇన్‌స్పెక్టర్ జె.ఉమేష్, చందా శ్రీనివాస్, ఇంటెలిజెన్స్ రాజాకృష్ణ దాడి నిర్వహించారు. బొగ్గు తరలిస్తున్న లారీతో పాటు పల్లికొండ రామచందర్, ఎండీ గౌస్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి ఎస్అండ్‌పీసీ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాలలు

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు, టీఎస్ఆర్‌జేసీ విద్యాలయం, సాంఘిక సంక్షేమ, ఆదర్శ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



ధర్ని మానస



జె.సంధ్య

రామగుండం: పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ సారాత స్నీమ్ తెలిపారు. ధర్ని మానస, ఎంపీసీ–979, సిరి సహస్ర, ఎంపీసీ–969, చిప్ప సాయిగణేష్, ఎంపీసీ–969, బైపీసీలో సంధ్య 972, అర్చన 923, సీఈసీలో బి.స్వాతి 963, ఎంఈసీలో జి.మణిదీపిక 832 స్టేట్ ర్యాంకులు సాధించారు. ఫస్టియర్ ఫలితాల్లో ఎంపీసీలో జి.సాయి వర్షిత 441/470, బైపీసీలో బి.ప్రియాంక 417/440, సీఈసీలో వి.సాహిత్య 465/500, ఎంఈసీలో కె.అమూల్య 457/500 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కె.సాయిరామ్ వెయ్యికి 879, కె.చౌహాన్ 871, సీఈసీలో కె.శిరీష 823, ఫస్టియర్ ఎంపీసీలో మృణాళిని 448/470 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మదర్‌గౌడ్ తెలిపారు.

గురుకుల విద్యార్థుల విజయభేరి



ఎం.అఖిల



హిమవర్షిణి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని భూపతిపూర్ కస్తూరిబా బాలికల విద్యాలయం ఫస్టియర్ సీఈసీలో జి.శ్రావ్య 425, ఎంపీహెచ్‌డబ్ల్యూలో టి.నవ్యశ్రీ 477, సెకండియర్ సీఈసీలో ఎం.అఖిల 959, ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఎం.నిఖిత 954, జ్యోతిబాపూలే గురుకులంలో ఎంపీసీలో ఆర్.ఏడుకొండలు 984 మార్కులు సాధించారు. గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో ఫస్టియర్ ఎంఈసీలో వసుంధ 385/500, సీఈసీలో అశ్రిత 460/500, ఎంపీసీలో సంగీత 417/479, బైపీసీలో హర్షవర్ధిని 371/440, సెకండియర్ సీఈసీలో జ్ఞానేశ్వరి 953, బైపీసీలో దివ్య 906 సాధించారు. గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో ఫస్టియర్ సీఈసీలో అంజలి 431/500, సెకండియర్ సీఈసీలో దీక్ష 946, ఏఅండ్‌టీలో హిమవర్షిణి 969 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్స్ స్వప్న, రత్నాకర్, రాంబాబు, అరుణ, అధ్యాపక బృందం అభినందించారు.

జిల్లా టాపర్‌గా టీఎస్ఆర్‌జేసీ విద్యార్థి



రాజ్‌కుమార్



సంజయ్

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారం టీఎస్ఆర్‌జేసీ విద్యాలయం విద్యార్థులు సత్తాచాటారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రాజ్‌కుమార్ 985 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. ఇదే విద్యాలయం విద్యార్థి సంజయ్ ఎంపీసీలో 977 మార్కులు సాధించి జిల్లా సెకండ్ టాపర్‌గా నిలిచాడు. మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో భూక్య సాయిప్రియ ఎంపీసీలో 965 మార్కులు సాధించింది. నందిమేడారం బాలికల విద్యాలయంలో ద్వితీయ సంవత్సరంలో 70 మందికి 64, ధర్మారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 99 మందికి 42, ఆదర్శ జూనియర్ కళాశాలలో 81 మందికి 55 మంది విద్యార్థులు పాసయ్యారు.

51.7 శాతం ఉత్తీర్ణత



రాజ్‌కుమార్



నీరజ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ కళాశాలలో రెండో సంవత్సరం 85 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 44 మంది పాసయ్యారు. 51.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో రాజ్‌కుమార్ 967, ఒకేషనల్‌లో అడ్డగుంట నీరజ్ 933, సీఈసీలో నదీమా 925 సాధించారు.

బాలికల ప్రతిభ



బి.వర్ష



ఎం.సుస్మిత

జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెద్దాపూర్ ఆదర్శ, తేలుకుంట కస్తూరిబా బాలికల కళాశాలల్లో బాలికలే పై చేయి సాధించారు. ఎంపీసీలో డి.ఆశ్రిత 966, బైపీసీలో సీహెచ్ అభినయ 944 మార్కులు సాధించారు. కస్తూరిబా విద్యాలయంలో బైపీసీలో ఎం.సుస్మిత 957, కె.రమ్య 951, ఎంపీసీలో బి.వర్ష 959, బి.సిరి 941 మార్కులు సాధించారు.

ముత్తారంలో..

మంథని: ముత్తారం కస్తూరిబా విద్యాలయం, దర్యాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. సీఈసీ ఫస్టియర్‌లో బురుగు వైష్ణవి, హర్షితాశ్రీ 488 మార్కులు సాధించారు. సెకండియర్‌లో ఎరుకల భవాని వెయ్యికి 957, వర్ష 914, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో సెకండియర్‌లో చొప్పరి సాయివర్షశ్రీ 984, గౌతమి 974, మోడల్ స్కూల్‌లో ఎంపీసీలో రాణి 955, బైపీసీలో అక్షిత 971, సీఈసీలో రజిత 947 మార్కులు సాధించారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం కళాశాలలో సెకండియర్ ఎంపీసీ ఎం.వైష్ణవి 959, బైపీసీలో ఓ.అరుణ 913, సీఈసీలో ఈ.హరీశ్ 871 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో బైపీసీలో ఆర్.శ్రీనిధి 434, ఎంపీసీలో పి.రక్షిత 444, సీఈసీలో బి.నవత 332 మార్కులు సాధించారు.

మంథనిలో..



అక్షయ



దివ్య

మంథని: మంథనిలోని సాంఘిక సంక్షేమ, మైనార్టీ, గిరిజన బాలికల గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఫస్టియర్ ఎంపీసీలో బిందు 428, బైపీసీలో కావేరి 406 మార్కులు సాధించారు. సెకండియర్లో ఎంపీసీలో అక్షయ 968, బైపీసీలో దివ్య 942 మార్కులు సాధించారు. సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో బైపీసీలో హరీశ్ 965, ప్రమోజ్ 961, సాయి మారుతి 957, మంథని ప్రభుత్వ బాలికల కళాశాలలో రంగు వెన్నల 950, ఎంపీసీలో గడ్డం నీతిశ 943, సీఈసీలో పోతరవేన సాయిలక్ష్మి 931, గుమ్మడి కీర్తన 930 మార్కులు సాధించారు. బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీలో జి.మనోహర్ 933, ఎంపీహెచ్‌డబ్ల్యూలో శ్రీలత 949 మార్కులు సాధించారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..



రాపర్తి అనూష



వొల్లాల రితిక

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మల్యాల మోడల్‌స్కూల్‌లో రాపర్తి అనూష ఎంపీసీలో వెయ్యికి 986, బీపీసీలో వొల్లాల రితిక 983, పల్లేర్ల శ్రీజ 940 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్‌లో 63.52 శాతం ఫలితాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 38 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఓదెలలో..



బొడకుంట శివాణి

ఓదెల(పెద్దపల్లి): ఓదెల ప్రభుత్వ కళాశాలలో ఫస్టియర్‌లో 74 మంది పరీక్షలు రాయగా 43, సెకండియర్లో 79 విద్యాలకు 24 మంది పాసయ్యారు. సెకండియర్ బైపీసీలో బొడకుంట శివాణి 940, సీఈసీలో సిరిశేటి అర్చన 902 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ప్రిన్సిపాల్ కల్పన, లెక్చరర్లు అభినందించారు.

ట్రినిటి విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి మంచి మార్కులు సాధించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఫస్టియర్ ఎంపీసీలో ఉమేమ 466 మార్కులు సాధించగా ఈదునూరి శ్రీకర్ 466, మౌనిక 465, దాడి నిఖిత 464, అనుమాల నిషా 464, సాత్విక 463 మార్కులు సాధించారు. బీపీసీలో హెర్మన్ 434, శ్రీనిధి 433 మార్కులు పొందారు. సెకండియర్‌లో కొండి నిఖిత 990, మనోజ్ఞ 988, నిరంజన 985, గీత 983, మానస 988, ధనలక్ష్మి 982, సింధు 980, సుమేర అంజుం 977, పొన్నం ఐశ్వర్య 977 మార్కులు సాధించారు. ఇంటర్ పరీక్షల్లో ట్రినిటి విద్యార్థులు నాలుగు దశాబ్దాలుగా మంచి ఫలితాలు సాధిస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

గాయత్రీ విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: ఇంటర్ ఫలితాల్లో పెద్దపల్లి గాయత్రీ కాలేజీ విద్యార్థుల హవా కొనసాగింది. ఎంపీసీ సెకండియర్ విద్యార్థిని శ్రీజ 985 మార్కులు సాధించగా బీపీసీలో సింధుజ 979, సీఈసీలో సాత్విక 957 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో రాహుల్ 487, లక్ష్మీప్రసన్న 417 మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎస్‌వీజేసీ యాజమాన్యం

'ఎస్‌వీజేసీ' విజయకేతనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్‌వీజేసీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎంబడి శ్వేత 990, ఎంపీసీలో వంగల రిషిక 989, నాగుల లయ 988 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జుల హర్షిత 465, గడ్డం సాయిభువ 465, గుజార్ మనిదీక్షిత 465, కుమ్మరి సంస్కృతి 465, జె.సంతోష్ 465, కొయ్యడ అభిజ్ఞ 464, బి.దీక్షిత్ 464, బి.రాహుల్ 464, జి.గణేశ్ 464 మార్కులు, బైపీసీ విభాగంలో టి.శ్రీఅక్షిత్ 432, గుండా అక్షయ 430, ఎంఈసీలో మద్దూరి అక్షయ 477 మార్కులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ ఊట్కూరి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల కఠోర శ్రమకు, అధ్యాపకులు కృషికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. జేఈఈ, నీట్, ఎంసెట్‌లలోనూ ఉత్తమ శిక్షణనిస్తున్నామని చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయనతోపాటు ఎస్‌వీజేసీ బాలుర క్యాంపస్ ప్రిన్సిపాల్ మేడ వెంకటవరప్రసాద్, బాలికల క్యాంపస్ ప్రిన్సిపాల్ కాంతల రాంరెడ్డి, డైరెక్టర్లు సింహాచలం, హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సెక్యూరిటీ సిబ్బందికి అండగా ఉంటాం

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఎల్లవేళలా అండగా ఉంటామని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య అన్నారు. సెంటనరీకాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడ మైదానంలో సెక్యూరిటీ సిబ్బందిని మంగళవారం కలిసి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట ఈసంపెల్లి రమేష్, బైరం సదానందం, బోట్ల శివశంకర్, తిరుపతి, రామస్వామి, తదితరులున్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.బిందు 990, బైపీసీ విభాగంలో జి.రోషిణి 989, ఎంఈసీ విభాగంలో జి.ఈశ్వర్ తేజ 983, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.విశ్వహరితాజ్ 466, కె.స్నిగ్ధ 466, కె.అక్షయ 466, బైపీసీలో ఎం.సిరివెన్నెల 435, ఎంఈసీలో టి.హారిక 479, సీఈసీలో జె.ప్రశాంత్ 491 మార్కులు సాధించారని తెలిపారు. నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలన్న లక్ష్యంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఏటా ఎంసెట్, నీట్, ఐఐటీ, జేఈఈ తదితర పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

'ఎస్ఆర్'కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.పూజ 994 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఎ.తిరుమలేశ్ 990, ఎ.రాము 990, ఎస్.ప్రవీణ్‌కుమార్ 990, బైపీసీ విభాగంలో ఎన్.మణిమాల 990, జి.ఆర్యన్ 989, ఎస్.కీర్తి 988, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్.వైష్ణవి 467, ఎన్.హాసిని, ఎ.పల్లవి, ఎ.సువర్ణ, ఎం.శ్రావణిలు 466, సీహెచ్.ప్రణవి, పి.శ్రీజ, జి.సుప్రిత్, ఆర్.శ్రీనాథ, కె.ఓమేశ్వర్, బానోత్ జ్యోతిరాం, వి.నరేంద్ర శివ, కె.అభిరామ్, సీహెచ్.హరిత, ఎస్.భవాని, ఎస్.ప్రియాంక, బి.రచన, బి.నాగలక్ష్మి, డి.శ్రీజ, జి.శ్రీజ, వి.నందిని, ఎస్.జాస్మిత, ఎస్.మహితలకు 465, బైపీసీ విభాగంలో ఇందిర ప్రియదర్శిని, జి.శ్రీజలకు 434, ఎ.హన్సిక, బి.శిరీష 433, పి.వైష్ణవి, ఎస్.విష్ణుప్రియ, పి.లక్ష్మీప్రసన్న 432, జె.వేణుకుమార్, వి.హారిక 430 మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ఆయనతోపాటు డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, కరీంనగర్ జోనల్ ఇన్‌చార్జి వాసుదేవరెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగార్జున్‌రెడ్డి, తిరుపతి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మారుతి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపును వినియోగించుకోవాలి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ఉచిత వేసవిశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక సింగరేణి జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్ననాటి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. శిక్షణ శిబిరం ఈనెలాఖరు వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, బాక్సింగ్, కరాటే శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు గంద్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పోనగోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అబద్ధాల్లో తండ్రి చారాణ.. కొడుకు బారాణ'



గోదావరిఖని(రామగుండం): తండ్రి కేసీఆర్ చారాణ వంతు అబద్ధాలు ఆడితే కొడుకు కేటీఆర్ బారాణ వంతు అబద్ధాలు ఆడుతాడని బీజేపీ నాయకుడు సోమారపు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. మంగళవారం శివాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బహిరంగసభలో ప్రజలకు ఒక్క నిజం అయినా చెబుతాడని అనుకున్నామని, కానీ చెప్పిన మాటల్లో ఒక్కటి కూడా నమ్మే విధంగా లేదన్నారు. గ్యాస్ ధర గురించి మాట్లాడుతూ మహిళలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గ్యాస్ ధరలో రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా 55 శాతం పన్ను విధిస్తుందని, కేంద్రం 25 శాతం వరకు పన్ను విధిస్తుందని, కేంద్రం విధించే పన్నులో నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి 40 శాతం తిరిగి ఇచ్చేస్తుందన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.520 రాష్ట్ర ప్రభుత్వం పన్ను రూపేణా వసూలు చేస్తుందన్నారు. పన్ను తగ్గిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఇప్పుడున్న ధర ప్రకారం రూ.600లకే సిలెండర్ ఇవ్వచ్చన్నారు. రాజస్థాన్‌లో పన్ను పూర్తిగా తీసేసి రూ.500లకే ఇస్తున్నపుడు ధనిక రాష్ట్రం తెలంగాణలో ఎందుకు ఇవ్వలేరని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరెంటు ఛార్జీలు, బస్ ఛార్జీలు అధికంగా పెంచి ప్రజలపై పన్ను భారం మోపుతున్నారన్నారు. సమావేశంలో పిడుగు కృష్ణ, పి.మల్లికార్జున్, మందల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

గోదావరిఖని(రామగుండం): మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్లు బలరాం, సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. ఏరియాల వారీగా జరిగిన ప్రమాదాలు, అందుకు గల కారణాలు విశ్లేషించారు. సైన్ బోర్డులు, రక్షణ పరికరాలపై అవగాహన కల్పించడం, తదితర మార్గాల ద్వారా ఉద్యోగులను చైతన్య పరిచేలా చర్యలు తీసుకున్నట్లు ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు. సమావేశంలో వకీల్‌పల్లి గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం సలీం, ఏరియా రక్షణ అధికారి రవీందర్, ఏరియా ఇంజినీర్ నర్సింహా రావు, మేనేజర్ డి.రమేష్, రవికిరణ్ పాల్గొన్నారు.

అనుక్షణం రక్షణతో పని చేయాలి

కమాన్‌పూర్(మంథని): వేసవిలో ఉపరితల గనుల్లో రక్షణతో పని చేయాలని సింగరేణి డైరెక్టర్లు బలరాం, సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, జీఎం సేఫ్టీ కె.గురువయ్య అన్నారు. మంగళవారం ఆర్జీ–3 ఏరియా జీఎం, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రక్షణపై వివరించారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ, అధికారులు ఎలిషా, రఘుపతి, నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, నాగరాజు, ఉదయ్ హరిజన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.